# రిటైర్‌మెంట్

## మోహన్‌కుమార్

> మార్పు రావాలి. మార్పు అది ఏ రకందైనా కనీసం కొంత మంచిని చేస్తుంది. సరే ఇవి ప్రస్తుతం ముందు వెంటనే జరుపవలసిన పనులు. వీటిలో కొత్తవేమీ లేవు. మనం ఎంతకాలం నుంచో అనుకుంటున్నవే, చూద్దాం.

"సెక్రటరీగారు రమ్మంటున్నారు"

భాస్కర్రావు తలెత్తి చూసాడు. చదువుతున్న ఫైలు పక్కకి పెట్టి పక్కనే ఉన్న నోట్‌బుక్ తీసుకుని బయల్దేరాడు సెక్రటరీ గదిలోకి అడుగు పెట్టాడు

"కూర్చోండి"

భాస్కర్రావు కూర్చున్నాడు పుస్తకం తెరిచి పెన్ చేత్తో పుచ్చుకుని ఆయన చెప్పే పాయింట్సు రాసుకోడానికి సిద్ధంగా ఉన్నాడు

"కొత్త మంత్రిగారు చూడబోతే బాగున్నాడు. అడ్మినిస్ట్రేషన్‌లో తను చీటికి మాటికి జోక్యం కలిగించుకోనని చెప్పాడు ఆయనకి ఏంకావాలో అవి ఎప్పటిలోగా కావాలో చెప్తాడట దాన్ని ఎలా చెయ్యాలి అన్నది మనకి వదిలేస్తాడట మనం ఆయన చెప్పిన కార్యక్రమాన్ని ఆయన ఇచ్చిన టైంలోగా అమలుచెయ్యగలమా లేదా? అమలు చెయ్యడానికి ఏమే వనరులు కావాలి. ప్రభుత్వం నుంచి మిగిలిన డిపార్టుమెంట్ల నుంచి ఎలాంటి సహాయ సహకారాలు కావాలి—అన్న విషయాన్ని స్టడీ చేసి ఆయనకి చెబితే అవి మనకి సమకూరేలా చేస్తానని చెప్పాడు. దైనందిన వ్యవహారాల్లో తను తలదూర్చనని, శ్రద్ధగా పనిచేసి ఫలితాలు చూపించడానికి అవసరమైనంత స్వేచ్ఛ నిస్తానని చెప్పాడు. అయితే ఏదైనా కంప్లయింట వస్తే కల్పించుకోవల్సివస్తుందన్నాడు ఇదీ బాగానే ఉంది బొడ్డూడని ఓ యువజననాయకుడి దగ్గర్నుంచి కాటికి కాళ్లు చాచుకున్న వృద్ధ నాయకుడి వరకు ప్రతివాడూ తిండోపతిండాలగా ప్రతి నిమిషం మన ఆఫీసుమీదకి దండెత్తి మన ఎదురుగా తిష్టవేసుక్కూర్చుని వాళ్ళక్కావలసిన పనులు చేయించుకోడం కోసం మన మీద వత్తిడి తేవడంకన్నా ఈ పద్ధతి మెరుగుకదూ" అన్నాడు సెక్రటరీ

"నిజమే! వాళ్ళక్కావల్సిందేదో స్పష్టంగా చెప్పి మిగిలినది మనకి వదిలేస్తే మనం త్వరగా ఆ పని చెయ్యడానికి అవకాశం ఉంటుంది ఆ పనిని సకాలంలో పూర్తి చెయ్యడానికి ఓ షెడ్యూలు వేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతేగాని తడవతడవకి ఒక్కొక్కడొచ్చి ఒకో కేసు రికమెండ్ చేస్తూ వుంటే ఏ పనీ చేస్తాం. రికమెండేషన్ లేనిపని పూర్తిగా ఆగిపోతుంది దీన్ని సాకుగా తీసుకుని మనవాళ్లు అవినీతికి పాల్పడుతున్నారు. అందరికీ చెడ్డ పేరొస్తుంది కాబట్టి ఆఫీసుల్లోకి వరదల్లా దళారీలు రాకుండా నివారించటమే మంచిది"

"అందుకే మార్పు కావాలి మార్పు-అది ఏ రకందైనా కనీసం కొంత మంచిని చేస్తుంది. సరే ఇవి ప్రస్తుతం మనం వెంటనే అమలు జరుపవలసిన పనులు. వీటిలో కొత్తవేమీ లేవు మనం ఎంతకాలం నుంచో అనుకుంటున్నవే ఆయన వీటిని గట్టిగా అమలు చేస్తానంటున్నాడు చూద్దాం ఎంతవరకు చేస్తాడో. మనతరపు నుంచి మనం పూర్తి సహకారాన్ని ఇవ్వాలి"

"తప్పకుండా మనం ఉన్నదే పని చెయ్యడానికి. పైవాళ్ళు దాన్ని ప్రోత్సహిస్తే అంతకన్నా కావల్సిందేముంది! నాకు మిగిలి ఉన్న మూడేళ్ళ సర్వీసులో వీటిని చెయ్యగల అవకాశం వస్తే ఎంతో సంతోషిస్తాను" అన్నాడు భాస్కరరావు సంతోషంగా

"అదేనేనూ అనుకుంటున్నాను. వెంటనే వీటికి యాక్షన్‌ప్లాన్ తయారుచెయ్యండి. నేనూ వీటిగురించి ఆలోచిస్తున్నాను. మీ ఆలోచన ఓ స్టేజీకి వచ్చాక నాకు చెప్పండి ఇద్దరం చర్చిద్దాం"

"ఈ రోజు సాయంత్రం నేను కాస్త త్వరగా ఇంటికి వెడదామనుకుంటున్నాను. ఎగ్జిబిషన్‌కి వెళ్లాలి ఇంట్లో ప్రాణం తీస్తున్నారు" అన్నాడు భాస్కర్రావు

"వెళ్లండి అప్పుడే ఆరయిపోయిందిగా"

"ఫర్వాలేదు. ఆరున్నరకి ఎగ్జిబిషన్ గ్రౌండ్ దగ్గర వాళ్ళకి కలుస్తానని చెప్పాను. వాళ్లు అక్కడుంటారు"


"మీ పిల్లలు సెటిల్ అయిపోయినట్టేనా"

"ఏదీ ఇంకా ఎక్కడ అమ్మాయికి పెళ్ళి చెయ్యాలి అబ్బాయి ఇంజనీరింగ్ ఈ ఏడాదతో అయిపోతుంది. ఆ తర్వాత ఇంకా చదువుతాడో ఉద్యోగం చేస్తాడో చూడాలి నేను కూడా ఎక్కడో ఓ చోట స్థలం కొనుక్కొని ఓ చిన్న ఇల్లు కట్టాలి గవర్నమెంట్ క్వార్టర్స్‌లో ఉన్నాం కాబట్టి ఇంతవరకు వేడి పుట్టలేదు. ఇంకో మూడేళ్ళలో రిటైర్తైపోతాను రోడ్డున పడతాను ఈ లోగా ఇవన్నీ చెయ్యాలి. ఆఫీసు పని ఒత్తిడిలో సమయం కుదరటం లేదు"

సెక్రటరీ నవ్వాడు. ఆయనకీ ఇలాంటి సమస్యలే. సర్వీసులో ఉన్న అందరికీ దాదాపుగా ఉండే సమస్యలు ఇవే

"మీరూ నా పరిస్థితిలోనే ఉన్నారన్నమాట" తల గోక్కుంటూ అన్నాడు "సర్వీసులో ఉన్నంతకాలం ఆఫీసు, సీటూ అంటూ వెంపర్లాడతాం ఒక్కరోజు శెలవుపెడితే కొంపలు మునిగిపోతాయేమో అని గిజగిజలాడతాం భార్యాపిల్లలు ఇంటిదగ్గర చెయ్యవలసిన పనిని గుర్తుచేస్తే విసుక్కుంటాం సమస్యల్ని పరిష్కరించకుండా చివరవరకు వాయిదా వేసి, ఆఖర్ని గోల పెడతాం నేను ఒక ఇంటిగురించి ఆలోచించడం మొదలెట్టాలి ఓ రెండునెలలు శెలవుపెట్టి ఇంటి సంగతి చూద్దామనుకున్నాను ఈలోగా గవర్నమెంటు మారింది. కుదరలేదు నా సర్వీసు ఇంకా రెండేళ్ళే వుంది చూడాలి" అన్నాడాయన.

భాస్కర్రావు నవ్వాడు. ఆఫీసులో ప్యూన్ దగ్గర్నుంచి, ఛీఫ్ సెక్రటరీవరకు రిటైర్ అవ్వబోయేముందు, అందరికీ ఉండే సమస్యలు ఒకే



లాంగ్ వే ఎవరిస్తాయి తగ్గట్టుగా వారికుంటాయి

"నేను వస్తాను" లేచాడు భాస్కర్రావు.

"సరే"

భాస్కర్రావు బయటికి వచ్చాడు. గదిలో కెళ్ళి సీట్లో కూర్చున్నాడు సమయం ఆరుగంటల అయిదు నిమిషాలు

ఇంకా పదనిమిషాల తర్వాత బయల్దేరచ్చు కొంచెం మిగిలిన ఆ పనిని పూర్తిచేసి బయల్దేరాడు

ఎగ్జిబిషన్ గేటుదగ్గర ఎదురు చూస్తోంది కుటుంబం

"అమ్మో ఈ రోజు మనం తొందరగా ఇంటి కెళ్ళిపోవాలి" అంది కూతురు వనజ

"ఏం" ఆశ్చర్యంగా చూసిందావిడ

"ఏంలేదు నాన్నగారు ఇవాళ ఆఫీసు నుంచి సరిగ్గా అన్న టైంకి వచ్చారు. అందువల్ల వర్షం వస్తుంది పైన మేఘాలు చూడు ఎలా దట్టంగా వున్నాయో"

నిజమే. ఆకాశం మేఘావృతమై ఉంది.

ఉండవే తల్లీ ఆహా అనకు మీ నాన్నగారు వస్తూ వస్తూ నాలుగు ఫైల్స్ తెచ్చుంటారు మనం ఎగ్జిబిషన్ చూస్తూంటే ఆయన ఓ మూల కూర్చుని పని చేసుకుంటూ ఉంటారు" అంది భాస్కర్రావు భార్య కమల

అందరూ గొల్లున నవ్వారు

ఆఫీసులో చకచక అన్నింటినీ టైంకి చేసే వ్యక్తిగా పేరు తెచ్చుకున్న భాస్కర్రావుని, 'అన్నింటిలో లేటు' అని ఇంటిదగ్గర భార్యాపిల్లలు ఆట పట్టిస్తూంటారు

"ఈరోజు ఫైల్స్, గియిల్స్ ఏం లేవు లెటజ్ ఎంజాయ్" అన్నాడు భాస్కర్రావు

"కీపిటప్ డాడీ" అంది కూతురు.

టిక్కెట్లు కొనుక్కుని లోపలికెళ్ళారు ఆ సాయంత్రం సంతోషంగా గడిచిపోయింది పిల్లల బలవంతం మీద భాస్కర్రావు, కమల రంగుల రాట్నం తిరిగారు ఉయ్యాల ఊగారు. 'జెయింట్ వీల్' ఎక్కారు. మళ్ళీ చిన్నపిల్లల్లా అయ్యారు.

"చూడు మనం ఎంత హుషారుగా వున్నామో! మనం ముసలివాళ్ళమయ్యామని ఎవరన్నారు?" అన్నాడు భాస్కర్రావు. 'జెయింట్ వీల్' మీద తిరుగుతూ. "అలా అని బాధ్యతల్ని తప్పించుకోకండి" అంది కమల

రాత్రి యిల్లు చేరుకున్నారు.

"ఎప్పుడు సెలవు పెడుతున్నారు?" అంది కమల పక్కవేస్తూ

"ఎందుకు?" అడిగాడు భాస్కర్రావు మంచం మీద కూర్చుని, గోడకి జేర్లబడి వారపత్రిక తిరగేస్తున్నాడు

"అమ్మాయికి సంబంధం చూడ్డానికి" కమల వారపత్రిక లాక్కుంది

"సీరియస్‌గా చెబుతున్నాను. మీరు రిటైరయిపోయేలోగా అమ్మాయికి పెళ్ళి చెయ్యాలి మనది అంటూ ఓ యిల్లు కట్టుకోవాలి అమ్మాయికి

సంబంధం, మనకొ స్థలం—ఈ రెండిటినీ చూడాలి మీరు చూసి సెలక్ట్ చెయ్యండి మిగిలింది నేనూ పిల్లలు చూసుకుంటాం"

"ఇంకా రిటైర్ అవ్వడానికి మూడేళ్ళుందిగా, తొందరేముంది ఇప్పుడే గవర్నమెంట్ మారింది సేవు పెట్టడానికి కుదరదు. ఇంకో ఆరు నెలల్లో అన్నీ సెటిల్ చేస్తాను ప్రామిస్"

కమల వినిపించుకోలేదు సణుగుతూ నే ముసుగులో దూరింది

భాస్కరరావుకి నిద్రపట్టలేదు

ఆఫీసులో చెయ్యవలసిన పని కొత్త ప్రభుత్వం ప్రకటించిన కార్యక్రమాలు, దాన్ని అమలుచేసే పద్ధతులు—ఇంట్లో సమస్యలు వాటి పరిష్కారాలు వీటిని గురించి ఆలోచిస్తూండగా తెలియకుండానే ఓ రాత్రివేళ కునుకుపట్టేసింది.

* * *

"ఏమండీ!" వెర్రిగా అరిచింది కమల

ఉలిక్కిపడి లేచాడు భాస్కరరావు

"ఏమైంది ?"

"మీరు ఈ నెలాఖరుకి రిటైరై పోతున్నారు"

కమల ముఖంలో చెమటలు పట్టాయి ఆందోళన పులుముకున్నట్టుగా వుంది ముఖం భాస్కరరావు నమ్మలేకపోయాడు.

"ఇదిగో పేపర్ చూడండి"

పేపర్ చూశాడు గవర్నమెంట్ నిర్ణయం ప్రకారం తను ఈ నెలాఖరుకి రిటైర్ కావాలి. అంటే ఇంకా సరిగ్గా పంతొమ్మిది రోజుల్లో మూటా ముల్లె సర్దుకోవాలి

ఇదేమిటి ?

అవినీతిపరులైన ఆఫీసర్లని సడన్‌గా డిస్మిస్ చెయ్యడం రివాజు. అంతేకాని నిజాయితీగా ముప్పై ఏళ్ళుగా పనిచేస్తున్న ఉద్యోగుల్ని ఏ ప్రభుత్వం ఇలా సడన్‌గా రిటైర్ చేయించదు తగు సమయం యిచ్చి హుందాగా సిబ్బరంగా రిటైర్ అయ్యేలా చేస్తుంది. ఇంతకాలం పనిచేసిన ఉద్యోగులపట్ల ప్రభుత్వం చూపవలసిన మినిమమ్ కర్టసీ అది ఇప్పుడు ఈ ప్రభుత్వం చేస్తున్నది రిటైర్‌మెంట్ కాదు, వివిధ హోదాల్లో వున్న వేలమందిని ఉన్నమాటగా 'డిస్మిస్' చెయ్యడమే!

భాస్కరరావు రక్తం ఉడికిపోయింది ప్రభుత్వం ఈ చర్య తీసుకోడానికి కారణం, దీనివలన యువతీయువకులకు ఉన్నపళంగా ఉద్యోగాలు వచ్చేస్తాయని(ట)!

ప్రభుత్వంలో పనిచేసే అందరికీ తెలుసు ఈ చర్యమూలంగా ఇరవై వేలకన్నా అవనపు ఉద్యోగాలు ఖాళీ అవవు రావు. వాటిలో చాలా వాటిని భర్తీ చెయ్యవలసిన అవసరంలేదు మిగిలిన వాటిలో చాలావాటిని ఇప్పటికే టెంపరరీగా చేస్తున్నవాళ్ళతో నింపాలి ఇక కొత్తవాళ్ళకి చోటేది. ఈ సంగతి తెలియని కొంతమంది యువతీయువకులు దీనికి చప్పట్లు కొట్టచ్చు. బాస్ రిటైరై పోతే ప్రమోషన్ వస్తుందనుకునే కొందరు ఉద్యోగులు హర్షం ప్రకటించచ్చు. కాని ఇది సరైన నిర్ణయమా ?

అతని ముఖంలో నెత్తురుచుక్క లేదు.

"ఇదేం విడ్డూరమండీ! ఇలా ఉన్నపళాన రిటైర్ అవమంటే ఎలా ?" అడిగింది కమల

భాస్కరరావు మాట్లాడలేదు.

"కుర్రాళ్ళకి ఉద్యోగాలు యివ్వాలంటే కొత్త అవకాశాలు కల్పించాలి. అంతేగాని త్వరగా రిటైర్ అయిపోమంటే ఎలా? ఇంకా నయం... యువతీయువకులు ఉండడానికి చోటులేదుకాబట్టి యాభై అయిదేళ్ళు దాటినవాళ్ళు ఇళ్ళు ఖాళీచేసి అడవుల్లోకి పోయి చెట్లకింద బతకిమనలేదు"

"దీని తర్వాత వచ్చే ప్రభుత్వం అలాగే అంటుంది"

"పోనీలెండి! ప్రభుత్వం తన చేతకానితనాన్ని సమర్థించుకోడానికి ఇంకో పనిచెయ్యచ్చు యాభై అయిదేళ్ళు దాటిన అందరూ తలో కాస్త విషం మింగి చచ్చిపొమ్మంటే పోలె! అప్పుడు సగం జనాభా తగ్గుతుంది ప్రభుత్వానికి ఏ బాధ్యతా ఉండదు"

భాస్కరరావుకి ఏమీ వినిపించటంలేదు

ఆఫీసులోను ఇంట్లోను బాధ్యతలనుకున్న పనులు, ఇంతకాలం తన సీటుమీద సామర్థ్యం మీద పెంచుకున్న అభిమానం, సాధించాలన్న యాంబిషన్—వీటిని సమాధిచేసి విరాగిగా మారడానికి ఏ ఉద్యోగికేనా కనీసం ఆరు నెలలు పడుతుంది రెండు వారాల్లో వీటిని తెంచుకోమంటోంది ఈ ప్రభుత్వం

"ఏమండీ! నాకో అనుమానం వచ్చింది" అంది కమల.

ఏమిటి అన్నట్టు చూశాడు

"అరవై ఏళ్ళు నిండిన ముసలి హీరో ఇంకా ఇంకా పదహారు సంవత్సరాల అమ్మాయితో డ్యూయట్ పాడుతూ గెంతులెయ్యొచ్చు చక్రాల కుర్చీలో కూర్చుని మాట్లాడడానిక్కూడా ఓపిక లేక కాటికి కాళ్ళు చాచుకున్నవాడు ఎం.ఎల్.ఎ ముఖ్యమంత్రి, గవర్నర్‌లాంటి పనులు చెయ్యొచ్చు. ఆ రంగాలలో కూడా యువతీయువకులున్నారు వాళ్ళకీ అవకాశాలు కావాలి. ఆ రంగాలలో కూడా యువరక్తం పరవళ్ళు తొక్కాలి, కొత్తనీరు ప్రవహించాలి. మరి వాళ్ళకి రిటైర్‌మెంట్ అక్కర్లేదా?"

భాస్కరరావు ఆలోచనలో పడ్డాడు.

'అవునుమరి వాళ్ళ రిటైర్‌మెంట్ మాటేమిటి? నిర్ణయాలు తీసుకునేవాళ్ళు, ఆ నిర్ణయాల పర్యవసానాన్ని అనుభవించే అవసరం లేనప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకోడానికేనా వెనుదియ్యరు'

భాస్కరరావు ఆలోచిస్తున్నాడు. గోడకి వేలాడుతున్న కాలండర్లో ఫిబ్రవరి ఇరవై ఎనిమిదో తారీఖు, కాటువెయ్యడానికి సిద్ధంగా వున్న తాచుపాములా కనిపించింది.

దానిముందు మిగిలిన సమస్యలు నీటిపాముల్లా అయిపోయాయి. ❋




లక్షలాది మందిని నిత్యం అలరిస్తోన్న టి.వి. సెట్ డయెనారా
సులభ వాయిదాలలో స్వంతం చేసుకోవచ్చు
సగం ధర చెల్లించి టి.వి.ని పొందండి
మిగతా సగం ధర నెలసరి వాయిదాలలో చెల్లించవచ్చు
డీలర్: PHONE: 20371
మట్టుపల్లి లక్ష్మయ్య సన్స్
క్లాత్ బజార్, గుంటూరు-522003
BABU ads. bezach